

బాల్య వివాహం నిలుపుదల

ఏలూరు: ఫేస్ బుక్ ద్వారా జిల్లా కలెక్టర్‌కు వచ్చిన సమాచారం మేరకు బాల్యవివాహాన్ని అడ్డుకున్నారు. స్థానిక చెంచుల కాలనీలో బాల్యవివాహానికి పెద్దలు పాల్పడుతున్నారనే సమాచారం మేరకు వెంటనే స్పందించిన కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తగు చర్యలు చేపట్టారు. ఈ మేరకు జిల్లా బాలల సంరక్షణ అధికారి డాక్టర్ సిహెచ్.సూర్యచక్రవేణి, చైల్డ్ హెల్ప్ లైన్ టీమ్ సమన్వయంతో అంగన్వాడీ వర్కర్ సహకారంతో బాలిక ఇంటికి చేరుకుని విచారణ చేశారు. బాలిక తండ్రి 12 ఏళ్ల క్రితం మృతిచెందాడు. తల్లి మరో వ్యక్తిని పెళ్లి చేసుకుని వెళ్లిపోయింది. అప్పటి నుండి బాలిక తన అక్క, అన్నయ్యతో కలిసి నానమ్మ, తాతయ్యల వద్ద ఉంటుంది. ఈ తరుణంలో ఎనిమిదో తరగతి చదువుతున్న బాలికకు వివాహం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సమయంలో ఆ బాలిక తనకు తెలిసిన వారి ద్వారా ఫేస్‌బుక్‌లో తన సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లింది. వెంటనే కలెక్టర్ స్పందించి బాలిక బంధువులకు కౌన్సెలింగ్ నిర్వహించి, వివాహాన్ని రద్దు చేయాలని డిపిఓను ఆదేశించారు. బాలిక చదువుతున్న స్కూల్ కి వెళ్లి బాలిక చదువుతున్న తరగతి గురించి ఆరా తీసి, స్కూల్‌కి వెళ్లడానికి అడ్మిషన్ ఇప్పించి చదువుకు కావాల్సిన అవసరాలను గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు.

మైలు కూలి, లస్కర్ల వ్యవస్థ కనుమరుగు..!

అస్తవ్యస్తంగా గోదావరి డెల్టా కాలువలు

కలుషిత జలాలతో ప్రజలకు రోగాలు

కాల్వల పరిరక్షణకు నిఘా వ్యవస్థ

తప్పనిసరంటున్న రైతులు



లాకులు వద్ద పేరుకుపోయిన చెత్త, జంతు కళేబరాలు, గుర్రపుడెక్క

ప్రజాశక్తి - భీమవరం రూరల్

గోదావరి డెల్టాలో సాగునీటి కాలువల వ్యవస్థ నిర్వీర్యమవుతోంది. దీనికి ప్రధాన కారణం మైలు కూలీలు, లస్కర్ల పోస్టులు ఖాళీ అవుతున్నా గత మూడు దశాబ్దాలుగా భర్తీ చేయకపోవడమే. ఫలితంగా కాలువల మీద పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది.

గోదావరి డెల్టాలో ఏ ప్రాంతంలో చూసినా పంట కాలువలన్నీ కలుషిత జలాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, గుర్రపుడెక్క, తూడు, ఫ్యాక్టరీల వ్యర్థాలతో కలుషితమవుతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించాల్సిన ప్రభుత్వాలు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. ఫలితంగా ప్రజలు తాగునీటి సంబంధమైన రోగాల బారిన పడుతున్నారు. నూటికి 80 శాతం రోగాలు నీటి వల్లే వస్తాయని వైద్య గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఎంతో ప్రాధాన్యత కలిగిన గోదావరి డెల్టాలో సాగు, తాగునీటి కాలువల వ్యవస్థకు 150 సంవత్సరాల ఘన చరిత్ర ఉంది. అయితే గత మూడు దశాబ్దాలుగా లస్కర్లు, మైలు కూలీల పోస్టులు ఖాళీ అవుతున్నా ఏఒక్కటీ భర్తీ చేయడం లేదు. దీనివల్ల ఆయా ప్రాంతాల్లో నీటిపారుదల వ్యవస్థ రూపురేఖలు మారిపోయింది. గతంలో మైలు కూలీలు తమకు కేటాయించిన ప్రాంతంలో సంచరిస్తూ ఎప్పటికప్పుడు కాలువల తీరును గమనించేవారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు తిరుగుతూ ఎవరైనా చెత్తాచెదారం వేస్తే అడ్డుకునేవారు. కాల్వ గట్లు అంచుల వెంబడి తూడు, గుర్రపుడెక్క, కర్రనాచు వంటివి పెరిగితే వాటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేసేవారు. అదే విధంగా గట్లు పటిష్టపర్చడానికి నిద్రగన్నేరు చెట్లను విరివిగా పెంచేవారు. దీనివల్ల కాలవగట్లు పటిష్టంగా ఉండటమే కాకుండా చూడటానికి ఆహ్లాదకరంగా ఉండేది. నిద్రగన్నేరు చెట్లతోపాటు మామిడి తదితర ఫల సాయమిచ్చే చెట్లను కూడా పెంచేవారు. దీనివల్ల ఆ మార్గంలో ప్రయాణించే వారికి నీడ కూడా దొరికేది. ప్రస్తుత పాలకులు ఇవేమీ పట్టించుకోవడం లేదు. పంట కాలువల నిర్వహణను గాలికొదిలేశారు. పంట కాల్వలకు ఆనుకుని ఏర్పాటైన పరిశ్రమల వ్యర్థాలను సైతం వీటిలోకి విడుదల చేయడంతో కాల్వ నీరు కలుషితమవుతోంది. దీనివల్ల పంటలు దెబ్బతినడంతోపాటు తాగునీటిగా ఉపయోగించిన ప్రాంతాల్లో జనం రోగాల పాలవుతున్నారు. భీమవరం, నరసాపురం, పాలకొల్లు, తణుకు, తాడేపల్లిగూడెం తదితర ప్రాంతాల్లో ఈ దుస్థితి నెలకొంది.

రెండు దశాబ్దాల కాలంగా ఆక్వా సాగు జోరందుకోవడంతో పరిస్థితి మరింత దారుణంగా మారింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మూడు లక్షలకుపైగా ఎకరాల్లో ఆక్వా సాగవుతోంది. వీటి నుంచి కలుషిత నీటిని నేరుగా పంట కాలువల్లోకి వదిలేస్తున్నారు. రొయ్యల సాగుకు సంబంధించి ఉప్పు నీటిని సైతం కాల్వల్లోకి వదలడంతో నీటి వనరులు పూర్తిగా దెబ్బతింటున్నాయి. ఈ నేపథ్యంలో కాలువల పరిరక్షణకు కచ్చితంగా మైలు కూలీలు, లస్కర్ల వ్యవస్థ తరహాలో కొత్త వ్యవస్థనైనా ఏర్పాటు చేసి బలోపేతం చేయాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. తద్వారా ఎంతోకొంత కాల్వలను కాలుష్యం బారినుంచి రక్షించుకునే అవకాశం ఉంటుందని, అదే సమయంలో కాలుష్య కారకులపై ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

గోదావరికి మళ్లీ వరద

ఆందోళనలో ముంపు మండలాల ప్రజలు

కాజ్‌వేపైకి చేరిన నీరు

పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు

ప్రజాశక్తి - కుక్కునూరు

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులలో సామర్థ్యానికి మించి ఉన్న నీటిని దిగువకు వదలడంతో గోదావరికి వరద నీరు క్రమంగా పెరుగుతుండటం, దీనికితోడు కాపర్‌డ్యామ్ బ్యాక్ వాటర్ ప్రభావం వల్ల శుక్రవారం కుకునూరు - దాచారం మధ్య గల గుండేటి వాగుపై ఉన్న కాజ్‌వేపైకి వరద నీరు చేరింది. దీంతో వాగుకు ఒవైపున ఉన్న దాచారం, బెస్తగూడెం, నెమలిపేట, సీతారామపురం, అరవపల్లి, గుండంబోరు, ఉప్పరమద్దిగూడెం, తదితర 12 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గత నెలలో వచ్చిన గోదావరి వరదలకు నెలరోజులపాటు కాజ్‌వే ముంపులోనే ఉండటంతో 12 గ్రామాల ప్రజలు, రైతులు, విద్యార్థులు, వ్యాపారులు తీవ్రఇబ్బందులు పడుతూ చుట్టూ 15 కిలోమీటర్ల మేర తిరిగి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. వరద పూర్తిగా తగ్గడంతో గత 20 రోజులుగా రాకపోకలు కొనసాగుతున్నాయి. మళ్లీ వరద కాజ్‌వేను ముంచడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వ్యవసాయ సీజన్ ప్రారంభమవ్వడంతో గోదావరి వరదలు రావనే నమ్మకంతో మండలంలోని రైతులు పత్తి, మిర్చి పంటల సాగు పనిలో నిమగ్నమయ్యారు. మూడు నెలలుగా గోదావరి పెరుగుతూ, తగ్గుతూ ఉండటంతో దాచారం- కుక్కునూరు మధ్య కాజ్‌వేపై నుండి పది రోజులు కూడా రాకపోకలు సాగలేదు. వరద పెరుగుతుండటంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు.



కుక్కునూరు మండలంలో కాజ్‌వేను ముంచెత్తిన వరద

వేలేరుపాడు : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరికి భారీగా వరద నీరు చేరడంతో పాటు పోలవరం వద్ద నిర్మించిన కాపర్‌డ్యామ్ బ్యాక్ వాటర్ ప్రభావంతో శుక్రవారం ఎద్దువాగు, ఎర్రతోగు మధ్య గల ఎద్దువాగు కాజ్‌వేను వరద ముంచెత్తడంతో వాగు ఒవైపున ఉన్న కట్కూరు, టేకూరు, కోయిదా, కాసారం, తదితర 17 గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గోదావరికి వరద పెరిగితే పత్తి, మిర్చి పంటలు ముంపుకు గురవుతాయనే ఆందోళన రైతుల్లో నెలకొంది.

ఏలూరు మెడికల్ కళాశాల ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాలను వర్చువల్ విధానంలో సిఎం జగన్ శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. విజయనగరం జిల్లా గాజులరేగలో వైద్య కళాశాలను ప్రారంభించి అక్కడి నుంచి ఏలూరుతోపాటు మరో మూడు మెడికల్ కళాశాలలను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో విద్యార్థులంతా గొప్ప డాక్టర్లు కావాలని, ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. స్వాతంత్ర్యం వచ్చాక రాష్ట్రంలో కేవలం 11 మెడికల్ కళాశాలలు మాత్రమే ఉన్నాయని ఈ దృష్ట్యా మరో 17 వైద్య కళాశాలలను చేర్చి 28 మెడికల్ కాలేజీల దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గపరిధిలో ఓ మెడికల్ కాలేజీ ఉండబోతుందన్నారు. ప్రస్తుతం ఐదు మెడికల్ కాలేజీలను ప్రారంభించుకున్నామని, వచ్చే ఏడాది మరో ఐదు ప్రారంభిస్తామన్నారు. ఆ మరుసటి ఏడాది మరో ఏడు కాలేజీలు ప్రారంభిస్తామని తెలిపారు. 17 వైద్య కళాశాలల నిర్మాణం కోసం రూ.8480 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. కొత్త కాలేజీల వల్ల కొత్తగా 2250 యంబిబిఎస్ సీట్లు అందుబాటులోకి వస్తాయన్నారు. రాష్ట్ర ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించేందుకు ఫ్యామిలీ డాక్టరు తీసుకువచ్చామని, వైద్యరంగంలో 53 వేల మందిని రిక్రూట్ చేశామని చెప్పారు. ఈ నెల 30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతిగ్రామంలోనూ వైద్య శిబిరాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించబోతున్నామన్నారు.



మెడికల్ కళాశాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎప్పుడూ విద్య, వైద్యం ఈ రెండు విషయాలకు ఎక్కువ ప్రాధాన్యతిచ్చి ఎన్నో విప్లవాత్మక మార్పులను తీసుకువచ్చారన్నారు. ప్రస్తుతం ఏలూరులో వైద్య కళాశాలను ఏర్పాటు చేయడమే కాకుండా మంచి మౌలిక సదుపాయాలు కల్పించడం సంతోషంగా ఉందన్నారు. పోలవరం, జంగారెడ్డిగూడెం, చింతలపూడి మారుమూల ప్రాంతాల్లో ప్రజలు అత్యవసర వైద్యానికి రాజమండ్రి, విజయవాడ ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని అయితే ఏలూరులో వైద్య బోధనాసుపత్రి రావడం ద్వారా ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు మార్గం ఏర్పడిందన్నారు. ఏలూరు వైద్య కళాశాలలో 150 సీట్లు కలిగియుండగా, ఈ కళాశాల నిర్మాణానికి రూ.525 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఏలూరు వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని మాజీ ఉపముఖ్యమంత్రి, ఎంఎల్‌ఎ ఆళ్ల నాని, ఎంపి కోటగిరి శ్రీధర్ ఆవిష్కరించారు. అనంతరం ఏలూరు వైద్య కళాశాల ప్రారంభానికి చిహ్నంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెసి బి.లావణ్యవేణి, జెడ్‌పి చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, కైకలూరు ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు, ఏలూరు మేయర్ నూర్జహాన్ పెదబాబు, ఏయూడ చైర్మన్ మధ్యాహ్నపు ఈశ్వరీబలరాం, సాహిత్య అకాడమీ చైర్మన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, నగర డిప్యూటీ మేయర్లు నుడేర్‌బాబు, గుడిదేశి శ్రీనివాస్, ఎపి మెడికల్ బోర్డు కౌన్సిల్ సభ్యులు దిరిశాల ప్రసాద్, కో-ఆప్షన్ సభ్యులు ఎం.ఎస్.గురునాథ్ పాల్గొన్నారు.

వైద్యకళాశాల ప్రారంభం హర్షణీయం

రాష్ట్రంలో ఏలూరుతో పాటు మరో నాలుగు ప్రాంతాల్లో వైద్య కళాశాలలు ప్రారంభించుకోవడం హర్షణీయమని ఏలూరు ఎంపి కోటగిరి శ్రీధర్ అన్నారు. కళాశాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న జెడ్‌పి చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ ప్రసాదరావు, కైకలూరు ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావుతో కలిసి ఎంపి పాత్రికేయులతో మాట్లాడారు. గతంలో అవకాశమున్నా వైద్య కళాశాలలను ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు. కాని సిఎం జగన్ వైద్యరంగం అభివృద్ధికి నాలుగడుగులు ముందుకు వేశారన్నారు. ఏలూరు వైద్య కళాశాలలో 150 సీట్లు కేటాయించారని, ఏడాదికి రూ.10 వేలు ఫీజు మాత్రమే నిర్ణయించారని తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాల నిర్వహణకు ప్రభుత్వం ఏడాదికి రూ.250 కోట్లు ఖర్చుచేయనుందన్నారు.

నిర్బంధాలు, అణచివేతలతో ఉద్యమాలు ఆపలేరు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజాస్వామిక హక్కులను హరించి ప్రజాఉద్యమాలపైన, ప్రతిపక్ష నాయకులపై నిర్బంధ చర్యలు చేపట్టడం అన్యాయమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం తీవ్రంగా విమర్శించారు. స్థానిక పవర్‌పేటలోని ఉద్దరాజు రామం భవనంలో సిపిఎం జిల్లా కమిటీ సమావేశం ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు ప్రజాసమస్యలపై చర్చించి తీర్మానాలు ఆమోదించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సీతారాం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తున్నాయన్నారు. ప్రజాసమస్యలపై జరుగుతున్న ఉద్యమాలను నిర్బంధ చర్యల ద్వారా అణచివేసే చర్యలు చేపడుతున్నాయని చెప్పారు. ఇలాంటి చర్యల ద్వారా ప్రజాఉద్యమాలు మరింత పెరుగుతాయన్నారు. ప్రజాస్వామిక హక్కులను కాపాడాలని కోరారు. అగ్రిగోల్డ్ బాధితుల శంఖారావ దీక్షను రాకుండా ఎక్కడికక్కడ అరెస్టులు చేసి నిర్బంధించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.



మాట్లాడుతున్న మంతెన సీతారాం

అగ్రిగోల్డ్ బాధితులకిచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటలు దెబ్బతిని రైతాంగం నష్టపోవాల్సి వస్తుందన్నారు. మెట్టప్రాంత మండలాల్లోని చెరువుల్లో నీళ్లు లేకపోవడంతో సాగు, తాగునీటి సమస్య తీవ్రమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏలూరు జిల్లాలో 45 శాతం వర్షపాతం మాత్రమే నమోదైందని ఫలితంగా రాష్ట్రంలో అనేక జిల్లాల్లో తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించి సహాయకచర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఫలితంగా పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతాంగానికి పరిహారమిచ్చి ఆదుకోవాలని కోరారు. ప్రత్యామ్నాయ పంటలు వేసుకునేందుకు విత్తనాలు, ఇతర ఇన్‌పుట్స్ అందించాలన్నారు. ఉపాధి హామీ చట్టంలో వ్యవసాయ కార్మికులకు పనులు కల్పించాలన్నారు. జిల్లాలో వ్యవసాయ కార్మికులకు ఇవ్వాల్సిన ఉపాధి హామీ బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ జిల్లాలో అనేక ఫ్యాక్టరీల్లో ప్రమాదాలు పెరిగి కార్మికుల మరణాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. జిల్లాలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని వెంటనే రోడ్లు బాగు చేయాలని కోరారు. జిల్లా ప్రధాన ఆసుపత్రిని మెడికల్ కాలేజీగా మార్చడంతో రోగులకు వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తగిన డాక్టర్లు, సిబ్బంది లేరని, రోగుల బెడ్స్ సంఖ్య సగానికి కుదించివేశారన్నారు. జిల్లా కేంద్రంలో ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్యం అందేలా చూడాలని కోరారు. ప్రజా సమస్యలు పరిష్కరించకపోతే సిపిఎం ఆధ్వర్యాన ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్, ఆర్.లింగరాజు, పి.కిషోర్, జి.రాజు, జిల్లా కమిటీ సభ్యులు ఎం.జీవరత్నం, పి.రామకృష్ణ, ఎ.ఫ్రాన్సిస్, బి.సోమయ్య, గుడిపాటి నరసింహారావు పాల్గొన్నారు.

పశు వైద్య సిబ్బందికి సేవా పురస్కారాలు

భీమడోలు: మూగజీవాల సేవ కోసం రైతన్నల పిలుపుపై తక్షణం స్పందించి సేవలందిస్తున్న పశు వైద్యులు, సిబ్బంది సేవలు అభినందనీయమని పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ జి.నెహ్రూబాబు అన్నారు. పశుసంవర్ధక శాఖ తరపున భీమడోలు ఏరియా పశు వైద్యశాలకు చెందిన సహాయ సంచాలకులు డాక్టర్ ఇక్కుర్తి సాయి రమేష్ ఆధ్వర్యంలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న జిల్లాకు చెందిన పలువురు పశు వైద్యులను, సిబ్బందికి గురువారం స్థానిక ఏరియా పశు వైద్యశాలలో విశిష్ట సేవా పురస్కాలను అందజేశారు. 77వ స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని వారు అందించిన సేవలకు గుర్తింపుగా సత్కరిస్తున్నట్లు భీమడోలు ఏరియా పశు వైద్య శాల సహాయ సంచాలకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నెహ్రూబాబు, వివిధ ప్రాంతాలకు చెందిన సహాయ సంచాలకులు డాక్టర్ పి,సుబ్రహ్మణ్యం, డాక్టర్ కె.శ్రీనివాస్, ఉపసంచాలకులు డాక్టర్ పి రంగనాథ్, పూళ్ళ పశువైద్యశాలకు చెందిన డాక్టర్ ఎం .హరికష్ణ, భీమడోలు ఏరియా పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఇక్కుర్తి సాయి రమేష్ మాట్లాడుతూ పశు వైద్యులు, సిబ్బంది విధి నిర్వహణ సందర్భంగా తీసుకోవాల్సిన చర్యలు, పశువైద్యం అందించే సమయంలో మెళుకువలను పాటించటం, ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల గురించి రైతులకు తెలియజేయడం వంటి వాటిగురించి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన 125 మంది పశువైద్యులను, సిబ్బందిని సత్కరించి మెమెంటోలు, పతకాలు అందజేశారు.

ఘనంగా మోక్షగుండం జయంతి

ఏలూరు అర్బన్: స్థానిక ఇరిగేషన్ డేటా కాంప్లెక్స్‌లో భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని ఎన్‌జిఒ అసోసియేషన్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు చోడగిరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇరిగేషన్ ఎస్ఇ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ మోక్షగుండం చేసిన విశిష్ట సేవలను కొనియాడారు. కావేరి నదిపై ఆనకట్ట నిర్మించి కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ఉన్న ఆయకట్టుకు నీరు అందించిన గొప్ప దార్శినికుడు అని, వారి సేవలను గుర్తించి బ్రిటిష్ ప్రభుత్వం సర్ అనే బిరుదు, భారత ప్రభుత్వం భారతరత్న ప్రధానం చేశారని తెలిపారు. ఇరిగేషన్ ఇఇ దేవ ప్రకాష్, పోలవరం సర్కిల్లో పనిచేస్తున్న ఇంజినీర్లు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

17 నుంచి పిఎం విశ్వకర్మ

ఏలూరు టౌన్: చేతి వృత్తుల నైపుణ్యం పెంపొందించి వారి ఉత్పాదక సామర్థ్యాన్ని, ఉత్పత్తుల నాణ్యతను మెరుగుపరచి వారికి మార్కెట్ సదుపాయాన్ని విస్తృతపరిచే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ నెల 17వ తేదీ నుండి పిఎం విశ్వకర్మ పథకాన్ని అమలు చేయనుందని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజరు పి.ఏసుదాసు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకంలో 18 ఏళ్లు నిండి, వారి పూర్వీకుల నుండి కుటుంబ వృత్తిగా చేస్తున్న హస్తకళాకారులు అర్హులని, వడ్రంగి, కమ్మరి, స్వర్ణకారులు, శిల్పకారులు, చర్మకారులు, తాపీ పనివారు, నాయీ బ్రాహ్మణులు, రజకులు, దర్జీలు, బుట్టల తయారీ, బొమ్మల తయారీ మొదలైన వృత్తుల వారు ఈ పథకానికి అర్హులని తెలిపారు. వీరికి పిఎం విశ్వకర్మ సర్టిఫికేట్, ఐడి కార్డ్ ఇస్తారని, ప్రభుత్వ ఉద్యోగి ఉన్న కుటుంబ సభ్యులు, ఐదేళ్ల క్రితం వరకూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ పథకాల్లో ప్రయోజనం పొందిన చేతివృత్తుల వారికి ఈ పథకం వర్తించదని పేర్కొన్నారు. అయితే ముద్ర, పిఎం స్వానిధి పథకంలో రుణం పొంది రుణాన్ని పూర్తిగా చెల్లించిన వారు ఈ పథకానికి అర్హులని తెలిపారు. అర్హత ఉండి రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి 15 రోజుల శిక్షణ ఇస్తామని, శిక్షణ కాలంలో రోజుకు రూ.500 స్టైఫండ్ ఇస్తామని తెలిపారు. అలాగే వారికి రూ.15 వేలు విలువైన టూల్ కిట్స్ ఇస్తామని తెలిపారు. రణం కావాల్సిన వారికి మొదటి విడత రూ.లక్ష, రెండో విడత రూ.2 లక్షలు ఐదు శాతం వడ్డీతో రుణం మంజూరు చేస్తారని పేర్కొన్నారు.

కొనసాగిన టిడిపి నిరసనలు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ టిడిపి, జనసేన ఆధ్వర్యంలో ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయానికి చేపట్టిన పాదయాత్రను పోలీసులు అడ్డుకోవడంతో వాగ్వివాదం చోటుచేసుకుంది. మండలంలోని మారంపల్లి నుండి శుక్రవారం ఉదయం జనసేన, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాదయాత్రగా ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయానికి బయలుదేరారు. టిడిపి మండల అధ్యక్షులు సత్తిపండు, జనసేన మండల అధ్యక్షులు దాకారపు నరసింహమూర్తి నేతృత్వంలో నాయకులు, కార్యకర్తలు, మహిళలు అధికసంఖ్యలో ఈ పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ యాత్ర తిరుమలంపాలెం వద్దకు రాగానే పోలీసులు అడ్డుకుని, పోలీస్ వాహనం, తాళ్లు అడ్డుపెట్టి అడ్డుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. శాంతియుతంగా పాదయాత్ర చేస్తున్న తమను అడ్డుకోవడం దారుణమని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో నాయకులను అరెస్టు చేసేందుకు పోలీసులు యత్నించారు. ఈ క్రమంలో టిడిపి నాయకులకు, పోలీసులకు మధ్య తీవ్రవాగ్వివాదం, తోపులాటలు జరిగాయి. అనంతరం పోలీసులను తోసుకుంటూ మహిళలు, నాయకులు, కార్యకర్తలు ముందుకుసాగారు. ద్వారకాతిరుమల చేరుకుని తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం శ్రీవారి పాదాల వద్ద కొబ్బరికాయలు కొట్టి చంద్రబాబుకు బెయిల్ రావాలంటూ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ద్వారకాతిరుమలకు పాదయాత్ర చేపట్టిన టిడిపి నాయకులను అడ్డుకుంటున్న పోలీసు అధికారి

చింతలపూడి : సిఎం జగన్ కళ్లల్లో ఆనందం చూడడానికి సిఐడి చంద్రబాబుని అరెస్ట్ చేసిందని మాజీ ఎంఎల్‌ఎ గంటా మురళీ, ఎఎంసి మాజీ ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి అన్నారు. చింతలపూడిలో చేపట్టిన 'బాబుతో నేను' రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజైన్‌టెక్ ఖాతాలను స్తంభింపజేస్తే హైకోర్టు విడుదల చేసిందని, ఆ సంస్థ రాష్ట్రంలో ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రాలు, సరఫరా చేసిన పరికరాల వివరాలన్నీ హైకోర్టుకు ఇచ్చారని, ఇడి విచారణలోనూ చంద్రబాబుకు డబ్బులు వచ్చాయని ఎక్కడా నిర్ధారించలేదన్నారు. జగన్ కళ్లలో ఆనందం చూడ్డానికే చంద్రబాబును అరెస్టు చేశారని ధ్వజమెత్తారు. ఈ దీక్షకు జనసేన నేతలు సంఘీభావం తెలిపి దీక్షలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మాటూరి వెంకట్రామయ్య, ప్రధాన కార్యదర్శి కోండ్రు దేవా, నియోజకవర్గ నాయకులు బొమ్మాజీ అనిల్, సొంగా రోషన్, లీలా ప్రశాంతి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ పట్టణంలో టిడిపి నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష నాలుగో రోజుకు చేరింది. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు రావూరి కృష్ణ, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు శీలం రామచంద్రరావు, నాయకులు మండల లక్ష్మణరావు, మండవ లక్ష్మణరావు, పరిమి సత్తిపండు, తడకమళ్ల గోపాలరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చింతలపూడి జనసేన కన్వీనర్ మేకా ఈశ్వరయ్య దీక్షకు సంఘీభావం తెలిపారు.

కైకలూరు : చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ టిడిపి నేతలు చేపట్టిన దీక్షలు కైకలూరులో కొనసాగాయి. మండలంలోని ఆటపాక పార్టీ కార్యాలయం వద్ద ఈ దీక్షలు చేపట్టారు.

ఆగిరిపల్లి : రాజకీయ దురుద్దేశంతో సిఎం జగన్ చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేయించారని నూజివీడు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. 'నేను సైతం బాబుతో' కార్యక్రమంలో భాగంగా ఆగిరిపల్లిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.కోటేశ్వరరావు, ఎ.రవీంద్ర, సుబ్బరాజు, నరసింహారావు, ఖాదర్, జోషిబాబు, సాంబశివరావు పాల్గొన్నారు.

ముసునూరు : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ముసునూరులో చేపట్టిన రిలే నిరాహార దీక్షలో కాట్రేనిపాడుకు చెందిన మహిళలు పాల్గొన్నారు. ఈ దీక్షను నూజివీడు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు సందర్శించారు. ఈ కార్యక్రమంలో సూర్యదేవర నాగమంజుల, గద్దల సుహాసిని, రాపర్ల ప్రతాప్, రాపర్ల బాలకృష్ణ, గద్దే రఘుబాబు, మందలపు ధర్మరాజు, సొంగా ఇస్సాక్, లక్కపాం కాంతారావు, పాల్గొన్నారు.

ముదినేపల్లి : చంద్రబాబు అరెస్టు నిరసిస్తూ ముదినేపల్లిలో టిడిపి శ్రేణులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. టిడిపి కార్యాలయం వద్ద కొడాలి వినోద్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ దీక్షలో పార్టీ మండల మాజీ అధ్యక్షులు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, దావు నాగరాజు, ఈడే సుధాకర్, బి.రవి, పి.సురేష్, వంశీధర్, రాకేష్, రవికుమార్, పంతగాని సురేష్ పాల్గొన్నారు. ఈ దీక్షలకు ముస్లిము సోదరులు తమ సంఘీభావం తెలిపారు.

మతవిద్వేషాలను రెచ్చగొడుతున్న బిజెపి : సాబ్జీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సనాతన ధర్మంపై ఉదయనిధి చేసిన వ్యాఖ్యలను వక్రీకరిస్తూ బిజెపి ప్రభుత్వం దేశంలో మతవిద్వేషాలను రెచ్చగొడుతుందని ఎంఎల్‌సి షేక్ సాబ్జీ విమర్శించారు. స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో శుక్రవారం కెవిపిఎస్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సాబ్జీ విచ్చేశారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో ఎంఆర్‌పిఎస్, మాల మహాసేన నాయకులు, దళిత ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. అనంతరం సాబ్జీ మాట్లాడుతూ సనాతన ధర్మం గురించి తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ మాటలను వక్రీకరించి బిజెపి, ఆర్ఎస్ఎస్‌కు చెందిన స్వామీజీలు ఉదయనిధి తల నరికితే రూ.10 కోట్లు ఇస్తానని చేసిన వ్యాఖ్యలు భారత రాజ్యాంగాన్ని కించపరిచే విధంగా ఉన్నాయన్నారు. తలనరికి తెమ్మన్న స్వామీజీపై సుమోటా కేసు కట్టాలని, ఈ వ్యాఖ్యలను సమర్థించిన ప్రధానమంత్రి మతాలు రెచ్చగొడుతున్నారని, రాజ్యాంగం మీద ప్రమాణం చేసి పరిపాలన చేస్తానని చెప్పిన భారత ప్రధాని మతాలను రెచ్చగొట్టేవ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. ప్రజలందరూ మతసామరస్యాన్ని పాటించాలని, మతఉన్మాదాన్ని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న సాబ్జీ

కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ మాట్లాడుతూ బిజెపి, ఆర్ఎస్ఎస్ ఎన్నికల సమయంలో ఇలాంటి అరాచకాలతో అధికారంలోకి రావాలని చూస్తుందని విమర్శించారు. గత ఎన్నికల సమయంలో బిజెపి ఇలాంటి జిమ్మిక్కులే చేసిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత గ్యాస్, పెట్రోల్, డీజిల్ రేట్లు అత్యధికంగా పెంచి ప్రజలపై భారాలను మోపిందని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో కుల, మతపరమైన గొడవలు రెచ్చగొట్టి లబ్ధిపొందాలని చూస్తుందని, దళిత, ప్రజాసంఘాలు అభ్యుదయవాదులు బిజెపి కుయుక్తులను తిప్పికొట్టాలని ఫ్రాన్సిస్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాలు మణిసింగ్, అజయ్ కుమార్, ఎం.ఇస్సాక్, బాలరాజు, ఎంఆర్‌పిఎస్ నాయకులు కందుల రమేష్, మాల మహాసేన జాతీయ అధ్యక్షులు ఎ.రవికుమార్, కె.రవికుమార్, జుజ్జవరపు రవిప్రకాష్, నాయక్, కెవిపిఎస్ నాయకులు యు.నిర్మల, కె.రాంబాబు పాల్గొన్నారు.

బెస్ట్ ఇంజినీర్ సూరత్‌తేజకు సత్కారం

ప్రజాశక్తి - ఏలూరు

బెస్ట్ ఇంజినీర్‌గా గుర్తింపుపొందిన శ్రీసోమా కన్‌స్ట్రక్షన్స్ అధినేత డాక్టర్ సూరత్ తేజను ఏలూరు లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ సభ్యులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఇంజినీర్స్ డే సందర్భంగా స్థానిక వైభవ్‌పోర్టులోని శ్రీసోమా కన్‌స్ట్రక్షన్స్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సూరత్‌తేజ మాట్లాడుతూ ఈ సత్కారం తనను ఎంతో ఉత్సాహపరిచిందన్నారు. పేదలకు సేవ చేయాలనే తపన, బాధ్యతను రెట్టింపు చేసిందని తెలిపారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు వి.జ్యోతి మాట్లాడుతూ సూరత్ తేజ అత్యాధునికంగా నిర్మాణాలు ఎంతో నైపుణ్యంతో చేపడుతూ, అనేక సేవా కార్యక్రమాలు చేసి ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. ఆయన ఆధ్వర్యంలో మరెన్నో అద్భుత కట్టడాలు, సేవా కార్యక్రమాలు చేపట్టి పేదలకు అండగా నిలబడాలన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సెక్రటరీ కె.మోక్షలక్ష్మీకుమారి, ట్రెజరీ ఎం.రాధికారాణి పాల్గొన్నారు.



సూరత్‌తేజను సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

ఏజెన్సీలో దోమల మందు పిచికారీ

జీలుగుమిల్లి: ఏజెన్సీ గ్రామాల్లో దోమల తీవ్రత ఎక్కువగా వుండడంతో విష జ్వరాల బారినపడే అవకాశం ఉన్నందున దోమల మందు పిచికారి చేస్తున్నట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి పెద్దిరాజు తెలిపారు. శుక్రవారం జీలుగుమిల్లి పిహెచ్‌సి పరిధిలోని గిరిజన గ్రామాలైన బర్రింకలపాడు, ఉదయ భాస్కర్ కాలనీలలో దోమల నివారణకు మలాథియన్ మందు పిచికారి చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమ తెరలను వాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సున్నం సురేష్, ఎఎన్ఎం లు, ఆశాలు పాల్గొన్నారు.



సాల్మన్‌రాజు మృతదేహానికి నివాళులర్పిస్తున్న సిఐటియు నాయకులు

సాల్మన్‌రాజు ధన్యజీవి : సిఐటియు

భీమడోలు: కార్మిక సమస్యల పరిష్కారం కోసం తన జీవితాంతం కృషి చేసిన కార్మికనేత, సిఐటియు మండల కార్యదర్శి వై.సాల్మన్‌రాజు ధన్యజీవి అని సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.లింగరాజు, డిఎన్‌విడి ప్రసాద్ తెలిపారు. గత ఆరు నెలలుగా అనారోగ్యం పాలైన సాల్మన్‌రాజు శుక్రవారం ఉదయం మరణించారు. ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు సిఐటియు సాల్మన్‌రాజు కుటుంబానికి అండగా ఉంటుందన్నారు. త్వరలో సాల్మన్‌రాజు స్మారక సభను నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. సాల్మన్‌రాజు అంత్యక్రియలు ఆయన స్వగ్రామమైన కొమిరేపల్లిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య, బి.విజయలక్ష్మి, ఐ.గోపి, కెవిపిఎస్ మండల కార్యదర్శి టి.సుమన్ బాబు నివాళులర్పించారు.

డ్రై డేతో డెంగ్యూ, మలేరియాకు చెక్

చింతలపూడి: ప్రతి శుక్రవారం డ్రైడే పాటించడం ద్వారా డెంగీ, మలేరియాలకు చెక్ పెట్టవచ్చని గోకవరం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఆర్.కృష్ణకిషోర్ తెలిపారు. మండలంలోని ప్రగడవరంలో ఆయన రైడే, డ్రైడే అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమ అమలు తీరును ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రజలు డ్రైడే పాటించడం అలవర్చుకోవాలని ఆయన సూచించారు. ఆరోగ్య విస్తరణ అధికారి అబ్రా హుస్సేన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు డ్రైడే అమలుపై విస్తృతమైన అవగాహన కల్పించాలని ఆరోగ్య కార్యకర్తలను ఆశాలను సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్ఎల్‌హెచ్ పి.భరత్ కుమార్ పాల్గొన్నారు.

రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి

ఆగిరిపల్లి: రసాయనిక ఎరువుల వినియోగాన్ని అధిక మోతాదులో వినియోగించడం వల్ల భూసారం కోల్పోవడంతో పాటు, రైతుకు ఆర్థికభారం పడుతుందని మండల వ్యవసాయాధికారి పల్లగాని చెన్నారావు తెలిపారు. మండలంలోని అమ్మవారిగూడెంలో నిర్వహించిన వైఎస్ఆర్ పొలంబడి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు వరి పంటలో పిలకలు, ఆకుల కత్తిరింపు, కాలిబాటలు తీయటం వలన కలిగే ప్రయోజనాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి కె.ధనబాబు, గ్రామ వ్యవసాయ సహాయకులు ఆర్.లక్ష్మి, కె.అపర్ణ, రైతులు పాల్గొన్నారు.

ప్రాధాన్యతా భవనాలను పూర్తిచేయాలి

ఏలూరు : ప్రాధాన్యతా భవనాల నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధికారులను ఆదేశించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం ప్రాధాన్యతా భవనాల నిర్మాణ పనులపై సంబంధిత అధికారులతో జెడ్‌పి ఛైర్‌పర్సన్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను గ్రామాలలోని ప్రజల వద్దకు తీసుకువెళ్లేందుకు గ్రామ/వార్డ్ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసిందన్నారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లకు సొంత భవనాలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ప్రాధాన్యతా భవనాల నిర్మాణాలను ఈనెల 15లోగా పూర్తి చేయాలని ఇప్పటికే జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసారన్నారు. అనంతరం ఇంజనీర్స్ డే సందర్భంగా భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సమావేశంలో ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్ కె.ఖాజావలి, డిఎల్‌డిఒ రమణ, కాంట్రాక్టు ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నవభారత్ పామాయిల్ ఫ్యాక్టరీలో అనధికార నిర్మాణాలు

జంగారెడ్డిగూడెం: స్థానిక నవభారత్ పామాయిల్ ఫ్యాక్టరీలో అనధికార నిర్మాణాలపై దృష్టి సారించామనిమున్సిపల్ కమిషనర్ పి.భవానీ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం నవభారత్ పామాయిల్ ఫ్యాక్టరీ ప్రాంగణంలో అనధికారికంగా నిర్మించిన నిర్మాణాలపై విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ భవానీ ప్రసాద్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో అనుమతులు లేకుండా నవభారత్ ఫ్యాక్టరీ ప్రాంగణంలో అధిక సంఖ్యలో నిర్మాణాలు జరిపినట్లు తెలిసిందన్నారు. వీటి ఆధారంగా అపరాధ రుసుము, ఆస్తి పన్ను విధించి వసూలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్, రెవెన్యూ అధికారి సుబ్బారావు పాల్గొన్నారు.

నేరాలు – ఘోరాలు

లారీని ఢీకొన్న ప్రయివేటు బస్సు: డ్రైవర్ మృతి
20 మందికి గాయాలు

ఏలూరు స్పోర్ట్స్: హఠాత్తుగా ఆగిన లారీని వెనుక నుంచి ప్రైయివేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో బస్సు డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందారు. 20 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలైయ్యాయి. ఈ ఘటన ఏలూరు జాతీయ రహదారిలో శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. సంబంధిత వివరాలకు వెళ్తే కావేరీ ట్రావెల్స్‌కు చెందిన మల్టీ ఆక్సిల్ ఎసి బస్సు ఏలూరు జాతీయ రహదారిలోని కలపర్రు టోల్‌ప్లాజా సమీపంలోకి చేరుకునేసరికి ముందుగా వెళుతున్న లారీ హఠాత్తుగా బ్రేక్ వేశాడు దీంతో బస్సు వెనుక నుంచి బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో బస్సు డ్రైవర్ తీవ్ర గాయాల పాలయ్యాడు. అతన్ని స్థానికులు 108 వాహనంలో ఏలూరు సర్వ జనాసుపత్రికి తరలించగా, అప్పటికే అతను మృతి చెందాడు. బస్సులోని ప్రయాణికులలో 20 మందికి స్వల్ప గాయాలయ్యాయి. అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం, లంకల గన్నవరం గ్రామానికి చెందిన అల్లాడ వెంకటనారాయణమూర్తి(44)గా బస్సు డ్రైవర్‌ను గుర్తించారు. పెదపాడు పోలీసులు ఎస్ఐ చల్లా కృష్ణ దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి శుక్రవారం రాత్రి బంధువులకు అప్పగించారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

చింతలపూడి: విద్యుత్ వైర్లు తగిలి గేదె మృతి చెందిన సంఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ముక్కంపాడు గ్రామానికి చెందిన బందెల కృపావరం అనే రైతు గేదె పొలాల్లో మేత మేస్తుండగా కరెంట్ వైర్లు తగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. ఈ మధ్యకాలంలో కాన్పు జరిగిందని, దాదాపుగా రూ.80 వేలు విలువ చేసే గేదె మృతి చెందటంతో ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఆదుకోవాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జీలుగుమిల్లి: పాముకాటుకి గురైన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలోని రెడ్డిగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రెడ్డిగూడెం గ్రామానికి చెందిన గోగుల అశోక్ రెడ్డి(18) గత శుక్రవారం పొలంలో నిద్రిస్తుండగా అర్థరాత్రి సమయంలో గుర్తు తెలియని పాము కాటుకి గురైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వెంటనే అంతర్వేదిగూడెం పిహెచ్‌సికి తరలించి, ప్రథమ చికిత్స అనంతరం జంగారెడ్డిగూడెంలోని సాయి స్ఫూర్తి ఆసుపత్రిలో చేర్చారు. పరిస్థితి విషమించడంతో గుంటూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందినట్లు కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మృతురాలి వివరాలు లభ్యం

ఏలూరు స్పోర్ట్స్ : నగరంలో గుర్తుతెలియని మహిళ రైలు కిందపడి మృతి చెందిన ఘటనలో మృతురాలి వివరాలు శుక్రవారం లభించాయి. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లింగపాలెం మండలం ధర్మాజీగూడెం గ్రామానికి చెందిన మండాది వెంకట సాయి లక్ష్మి(31) ఆర్థిక ఇబ్బందులతో రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో శుక్రవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'ను సద్వినియోగం చేసుకోవాలి

30వ తేదీ నుంచి గ్రామాల్లో ఇంటింటి సర్వే



చాట్రాయిలోని అవగాహనా కార్యక్రమంలో అధికారులు

ప్రజాశక్తి - చాట్రాయి

సిఎం జగన్ రాష్ట్ర ప్రజల ఆరోగ్యానికి సంబంధించి ప్రజల ఆరోగ్య వివరాలను సేకరించే 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం ఈనెల 30వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నారని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంపై అవగాహన సదస్సు చాట్రాయి మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ కె.మురళీమోహన్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సదస్సులో గ్రామ సర్పంచులు, ఎంపిటిసిలు, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొనగా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ఎఎన్ఎం, ఆశాలు, వాలంటీర్లు గ్రామాల్లోని ప్రతి ఇంటినీ సర్వే చేసి కుటుంబ సభ్యులకు ఉన్నటువంటి వ్యాధులు, బిపి, షుగర్, గుండె సంబంధిత మూత్రపిండాల సమస్యల వివరాలు సేకరిస్తారని తెలిపారు. అనంతరం గ్రామాలలో నిర్వహించే క్యాంపులో మందులు పంపిణీ చేస్తారిని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి మురళీకృష్ణ, హెల్త్ సూపర్‌వైజర్ రమణ పాల్గొన్నారు.

టి.నరసాపురం: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతిఒక్కరికి ఉచిత వైద్య సేవలు అందిస్తున్నట్లు ఎంపిపి దారబోయిన లక్ష్మి తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ఈనెల 30 నుంచి ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితులపై సర్వే నిర్వహిస్తారన్నారు. అదేవిధంగా ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలపై అవగాహన కల్పిస్తారన్నారు. ప్రజలందరూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ మంగా కుమారి, వైద్యులు ఫణీంద్ర పాల్గొన్నారు.

కైకలూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి అడవి కృష్ణమోహన్ తెలిపారు. శుక్రవారం ఎంఎల్ఎ దూలం నాగేశ్వరావు సూచనల మీద మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై సర్పంచులు, ఎంపిటిసిలకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ఈనెల 30వ తేదీ నుంచి ప్రతి సచివాలయంలో నలుగురు స్పెషలిస్ట్ డాక్టర్స్‌తో మెడికల్ క్యాంపు నిర్వహిస్తారని పేద ప్రజల కోసం నిర్వహించే ఈ క్యాంపును అందరూ ఉపయోగించుకునేటట్లు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎన్.ఉమామహేశ్వరావు, డా.హేమలత, సర్పంచి దానం నవరత్నకుమారి, మండల అధ్యక్షులు బత్రాజు శివాజి, సర్పంచిల ఫోరమ్ అధ్యక్షులు చెరుకువాడ బలరామరాజు, గ్రామాల సర్పంచిలు, ఎంపిటిసిలు, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలకు లోబడి సమస్యలు పరిష్కరించాలి

నెలవారీ సమీక్షలో డిఆర్‌డిఎ పీడీ విజయరాజు

ప్రజాశక్తి - భీమడోలు

ఫిర్యాదుదారుల సంతృప్తి మేరకు నిబంధనలకు లోబడి స్పందన ఫిర్యాదులను పరిష్కరించాలని డిఆర్‌డిఎ పీడీ, మండల పరిషత్ అధికారి ఆర్.విజయ రాజు కోరారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం స్పందన ఫిర్యాదులు, 12 ప్రభుత్వ శాఖల ద్వారా అమలవుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై నెలవారీ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి సిహెచ్ పద్మావతి దేవి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందన ఫిర్యాదుల పరిష్కారాన్ని పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. తిరిగి వాటిపై ఫిర్యాదుదారుడు తన సమస్య పరిష్కారం కాలేదంటూ మరొకమారు ఫిర్యాదు చేసేందుకు అవకాశం లేని విధంగా సమస్యల పరిష్కారం ఉండాలన్నారు. సమస్యలను పరిష్కరించే సమయంలో ఫిర్యాదుదారులు తొలిసారి సంతృప్తి లేదా అసంతృప్తి చెందినట్లు తన అభిప్రాయం తెలిపిన తర్వాత సదరు ఫిర్యాదుదారులకు ఉన్నతాధికారుల నుంచి సమస్య పరిష్కారం విషయమై ఆరా తీసేందుకు ఫోన్ వచ్చే అవకాశం ఉందని తెలపాలన్నారు. ఫిర్యాదుదారులతో ఇకవైసి చేయించిన తర్వాతే సదరు సమస్య పరిష్కారమైనట్టు పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఇదేక్రమంలో సమస్య పరిష్కారంపై ఫిర్యాదుదారులు తన అసంతృప్తిని ఒకసారి మాత్రమే తెలిపే అవకాశం ఉందన్నారు. దీనిపై అధికారులు స్పందించి వారం రోజుల లోపల సదరు సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని కోరారు. 'జగనన్నకు చెబుదాం' సమస్యల పరిష్కారంలో సైతం అధికారులు ఇవే విధానాలు పాటించాలని ఆయన కోరారు. 187 మంది గృహ నిర్మాణ లబ్ధిదారులకు ఉపాధి చట్టం ద్వారా మంజూరు కావలసిన 90 రోజుల వేతన బకాయిలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. గత మూడు నెలల కాలంగా వచ్చిన స్పందన ఫిర్యాదుల పరిష్కారంలో మండలంలోని ఫిర్యాదుదారులు సంతృప్తి సుమారు 50 శాతం మాత్రమే ఉందని, ఈ సంఖ్యను తగ్గించుకోవాలని సూచించారు. సమీక్షా సమావేశాలకు హాజరుకాని అధికారుల వివరాలు జిల్లా కేంద్రానికి తెలపాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న భీమడోలు వ్యవసాయ అధికారి మండలంలో 70 శాతం ఇకెవైసి కార్యక్రమం పూరైందన్నారు. భీమడోలు పంచాయతీ విస్తరణ అధికారి సుందరి మాట్లాడుతూ మండలంలో రూ.5.71కోట్ల టాక్స్‌లకు గాను రూ.3.70 కోట్లు మాత్రమే వసూలయ్యాయన్నారు. ఇదేవిధంగా నాన్ టాక్స్‌లుగా రూ.2.71 కోట్లు గాను రూ.2.10 కోట్లు వసూలయ్యాయని తెలిపారు.ఆ తర్వాత శాఖల వారీగా అధికారులు తమ శాఖల ప్రగతి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ సమస్య ఎఇ.సతీష్, ఐసిడిఎస్ భీమడోలు ప్రాజెక్ట్ సిడిపిఒ విజయలక్ష్మి, ఎపిఎం సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా 'ఇంజనీర్స్ డే'

చింతలపూడి: సుప్రసిద్ధ ఇంజనీర్, పండితుడు, ప్రముఖ అధికారి మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని చింతలపూడి లయన్స్ అధ్యక్షులు రాజేష్‌నాయుడు తెలిపారు. పట్టణంలో విద్యుత్ శాఖ సెక్షన్ కార్యాలయంలో మోక్షగుండ విశ్వేశ్వరయ్య జయంతి పురస్కరించుకొని 'ఇంజనీర్స్ డే' సందర్భంగా ఎఇ వెంకటరమణని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎఇ మాట్లాడుతూ మండలంలో మెరుగైన సేవలు అందిస్తామని తెలిపారు.

ఆక్వా రైతులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ముదినేపల్లి

స్వార్థపరులైన కొంతమంది ఆక్వా రైతులు రొయ్యలు, చేపల చెరువులోని నీటిని పంట కాల్వలోకి ఇంజిన్‌ల ద్వారా తోడు వేయటంతో పంట కాల్వలోని నీరు కలుషితమై తాగేందుకు పనికిరాకుండా పోతుంది అంటూ మండలంలోని దేవరం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ దేవరం ఆయుకట్టు పరిధిలోనే ఆక్వా సాగు చేసే రైతులు, పంట కాలవ పక్కన ఉన్న చెరువుల రైతులు చేపలు పట్టే సమయంలో చెరువులోనే వ్యర్థమైన నీటిని, రసాయనాలతో కూడిన నీటిని పంట కాలువలోకి తోడు వేయడంతో మంచినీటి చెరువులు, బావులలోని మంచినీరు కలుషితమవుతున్నాయన్నారు. దీంతో తాగునీటి కోసం తాము తీవ్ర అవస్థలు పడుతున్నామన్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఆక్వా చెరువులోని నీటిని పంట కాలువలోకి తోడుతున్న ఆక్వారైతులపై తగిన చర్యలు తీసుకుని చెరువులోనే నీటిని పంటకాల్వలోకి తోడకుండా చూడాలంటూ గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.

పోరాటాలకు సిద్ధం కావాలి : సిపిఐ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయుటకు కేంద్రంలో మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని, ఆ చట్టాన్ని కాపాడుకోవడానికి వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదలు పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పిలుపునిచ్చారు. శుక్రవారం సిపిఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం(బికెఎంయు) జిల్లా సమితి సమావేశం సంఘం జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి కృష్ణచైతన్య మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీలు, వ్యవసాయ కార్మిక సంఘాలు, దళిత సంఘాల పోరాట ఫలితంగా 2005లో యుపిఎ వన్ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టాన్ని తీసుకొచ్చిందని ఆయన తెలిపారు. ఈ చట్టం వల్ల గ్రామీణ పేదలకు, వ్యవసాయ కార్మికులకు, వ్యవసాయ పనులు లేని టైంలో పనులు కల్పించారని, కొంతమేరకు ఉపాధి దక్కుతుందని ఆయన తెలిపారు. వ్యవసాయ కార్మికులకు ఉపయోగకరంగా ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రంలో మోడీ ప్రభుత్వం గత తొమ్మిది సంవత్సరాలుగా బడ్జెట్ కేటాయింపుల్లో నిధులు తగ్గిస్తూ, రద్దు చేయుటకు ప్రయత్నిస్తుందని విమర్శించారు. బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, సాగు భూముల సొంతం కోసం 87 సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అనేక పోరాటాలు, ఉద్యమాలు నిర్వహించిందన్నారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కుంచే వసంతరావు మాట్లాడారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బత్తుల వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు బోడ వజ్రం, జిల్లా నాయకులు గోలిమే బాలయేసు, కూరాకుల బాబురావు పాల్గొన్నారు.

అభివృద్ధికి కృషి : సర్పంచి

చింతలపూడి: గ్రామపంచాయతీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని చింతంపల్లి సర్పంచి తాండ్ర రామకృష్ణ తెలిపారు. చింతంపల్లి గ్రామంలో గోద్రేజ్ పామాయిల్ ఫ్యాక్టరీ వారిచే పశువులకు, కోళ్లకి మందులు అందజేశారు. అనంతరం నూతన పింఛన్లను అందజేశారు. దాదాపుగా 300పైగా పశువులకు మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

పలు అంశాలపై చర్చ

పోలవరం : మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా ఎంపీపీ సంఘం అధ్యక్షులు, పోలవరం ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అలాగే అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో మండలంలో నిర్వహించాల్సిన అభివృద్ధి, సమస్యల గురించి మండల అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి కలుం హేమ కుమారి, ఎంపిడిఒ జి.శ్రీను, మండల తహాశీల్దార్ బి.సుమతి పాల్గొన్నారు.

కొబ్బరి సాగుపై రైతులు అవగాహన కలిగి ఉండాలి

టి.నరసాపురం: కొబ్బరి సాగు రైతులు చిన్న చిన్న జాగ్రత్తలు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని విజయరాయి ఉద్యాన కేంద్రం పరిశోధకులు తిరుపతిరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఉద్యాన, కొబ్బరి అభివృద్ధి బోర్డు ఆధ్వర్యంలో రైతులకు కొబ్బరి సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న తిరుపతిరెడ్డి మాట్లాడుతూ కొబ్బరి సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. చీడపీడల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. సూక్ష్మ పోషక దాతు లోపాలు లేకుండా చూడాలన్నారు. సవరణ పద్ధతులు పాటించాలన్నారు. కొబ్బరి సాగులో అంతర పంటలు కూడా సాగు చేయడం లాభదాయకమన్నారు. రైతులందరూ సాగు విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతిఒక్కరూ సాగుపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మోదుగు సునంద, ఉద్యాన అధికారి లఖ్‌పతి, సిబిడి సాంకేతిక అధికారి కిరణ్, రైతులు పాల్గొన్నారు.

'విద్యార్థులు ఆటల్లోను రాణించాలి'

ప్రజాశక్తి - ముసునూరు

విద్యార్థిదశలో ప్రతి ఒక్క విద్యార్థిని చదువుతో పాటు ఆటల్లో కూడా ప్రతిభ కనబరచాలని ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.వాణి తెలిపారు. శుక్రవారం ముసునూరు హైస్కూల్‌లో రెండో రోజు బాలికలకు అండర్-14లో కోకో జట్టుకు 14, అండర్-17 కోకో జట్టుకు 16, అండర్-17 బాల్ బ్యాట్‌మెంటెన్ జట్టుకు 21, అండర్-14 బాల్ బ్యాట్‌మెంటన్ జట్టుకు 16, అండర్-14 షెటిల్ జట్టుకు 5, అండర్-17 షెటిల్ జట్టుకు 5, అండర్-17 టెన్నికాయిట్ జట్టుకు 5, అండర్-14 టెన్నికాయిట్ జట్టుకు 5, అండర్-14 వాలీబాల్ జట్టుకు 17, అండర్-17 వాలీబాల్ జట్టుకు 17 మంది ఎంపికైయ్యారు. ఎంపికైన బాలికలు జిల్లాస్థాయి ఆటల్లో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయులు బి.సుకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.రవీంద్ర, వాకా నాగరాజు, ఆలీఖాన్, నెరుసుహేమ, సుగణరావు, నాగేశ్వరరావు, జి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉంగుటూరు: స్కూల్‌గేమ్స్ ఆధ్వర్యంలో 13, 14వ తేదీల్లో నిర్వహించిన మండల స్థాయి క్రీడ పోటీల్లో కైకరం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు 100 మంది పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం ప్రసాదరావు తెలిపారు. 100 మంది విద్యార్థులు నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు నాగ సుధా, పాపాయమ్మలను పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

'సిఎస్ టిఎస్ ప్రభుత్వ కళాశాల స్వర్ణోత్సవం'

జంగారెడ్డి గూడెం: సిఎస్‌టిఎస్ ప్రభుత్వ కళాశాల నిర్మించి 49 సంవత్సరాలు పూరైన సందర్భంగా 2023-24 సంవత్సరాన్ని స్వర్ణోత్సవ సంవత్సరంగా ప్రకటిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.ప్రసాద్ బాబు తెలిపారు. శుక్రవారం స్థానిక చత్రపతి శివాజీ జయంతి, కళాశాల స్థాపన దినోత్సవాన్ని పురస్కరించుకొని, కళాశాల స్థాపించి 50వ సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ఎన్.ప్రసాద్ బాబు సమక్షంలో 2023-24 సంవత్సరాన్ని స్వర్ణోత్సవ సంవత్సరంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం జరిగే కార్యక్రమాలన్నీ స్వర్ణోత్సవాల్లో భాగమేనన్నారు. దాత ఈ కళాశాల స్థాపించారని గుర్తు చేశారు. కళాశాల పేరు ప్రఖ్యాతలను నిలబెట్టడం ఇక్కడున్న అందరి బాధ్యతని, దానికి విద్యార్థులు సహాయ సహకారాలు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కళాశాల సిపిడిసి సెక్రెటరీ మొగళ్లపు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పేద విద్యార్థులందరూ చదువుకొని మూర్తి రాజు ఆశయం నిలబెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ సీనియర్ అసిస్టెంట్ వైఎస్ వి.శేషగిరి, కళాశాల వైస్ ప్రిన్సిపల్ బి.శ్రీనివాస్ రావు, ఐక్యుఎసి కోఆర్డినేటర్ డా.ఎం.మధు, కల్చరల్ కమిటీ కోఆర్డినేటర్ సిహెచ్.రమాదేవి పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర'లో పాల్గొనాలి

పోలవరం : గ్రామీణ, మండల, జిల్లా, నియోజకవర్గస్థాయిలో నిర్వహించే ఆటల పోటీలలో 15 సంవత్సరాలకు పైబడిన వారందరూ పాల్గొన వచ్చని ఎంపిడిఒ జి.శ్రీను తెలిపారు. 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంలో పాల్గొనే క్రీడాకారులు తమ తమ జట్లతో మీ పరిధిలో ఉన్న సచివాలయాలకు వెళ్లి రిజిస్టర్ చేయించుకోవాల్సిందిగా కోరారు. రిజిస్ట్రేషన్ ఆఖరి తేదీ ఈనెల 22లోపు సంబంధిత సచివాలయ సిబ్బందిని సంప్రదించాల్సిందిగా కోరారు.